ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
బుధవారం, 24 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM

# విమానం కూలి 18 మంది మృతి

## ఖాట్మాండు విమానాశ్రయంలో టేకాఫ్ తీసుకునే సమయంలో ప్రమాదం

## విమానంలో సిబ్బంది సహా 19 మంది.. పైలెట్‌కు తీవ్ర గాయాలు

### నేడు ఉదయం 11 గంటలకు ప్రమాదం

న్యూఢిల్లీ, జూలై 24 (ప్రజాస్వరం): నేపాల్ రాజధాని ఖాట్మాండులో ఘోర విమాన ప్రమాదం చోటు చేసుకుంది. త్రిభువన్ విమానాశ్రయంలో ఓ విమానం టేకాఫ్ తీసుకునే సమయంలో కూలిపోయింది. ఆ సమయంలో విమానంలో సిబ్బంది సహా 19 మంది ఉన్నారు. ఈ విమానం పోఖరాకు వెళ్తోంది. ఉదయం 11 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. విషయం తెలియగానే ప్రమాదస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకొని, సహాయక చర్యలు చేపట్టారు. మంటలు చెలరేగడంతో ఆర్పేందుకు సిబ్బంది ప్రయత్నిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది. ప్రమాదం జరిగిన ప్రదేశం నుంచి ఇప్పటి వరకు ఐదు మృతదేహాలను వెలికి తీశారు. విమానం పైలట్ కెప్టెన్ మనీష్ షాక్యాను రక్షించిన సిబ్బంది సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. టేకాఫ్ సమయంలో విమానం రన్‌వే పైనుంచి జారిపడి కూలిపోయింది. కూలిన విమానం శౌర్య ఎయిర్ లైన్స్‌కు చెందినది.





# నీది మేనేజ్‌మెంట్ పేమెంట్ కోటా..

## అసెంబ్లీలో రేవంత్.. కేటీఆర్ పరస్పర విమర్శలు

### కష్టపడి కిందిస్థాయి నుంచి ముఖ్య మంత్రినయ్యా : రేవంత్

### రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీది ఏ కోటా? కేటీఆర్

### కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ అసెంబ్లీలో వాడీవేడిగా చర్చ

### బీఆర్ఎస్ మారడం లేదు.. ప్రజలు ఓడించిన బుద్ధి రాలేదు

### కేంద్రం తెలంగాణపై వివక్ష చూపింది : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (ప్రజాస్వరం) : తెలంగాణ శాసనసభ సమావేశాలు రెండో రోజు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్లో తెలంగాణకు కేటాయింపులు చేయకపోవడంపై నిరసనగా తీర్మానం చేయాలని నిర్ణయించి.. దీనిపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార విపక్షాల మధ్య వాడీవేడిగా చర్చ జరిగింది. కీలకమైన అంశంపై చర్చ జరుగుతుంటే ప్రతి పక్ష నేతగా కేసీఆర్ ఎందుకు సభకు రాలేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. సభకు వస్తే ప్రధాని మోడీకి కోపం వస్తుందనే కేసీఆర్ రాలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు ఢిల్లీ వెళ్లి చీకట్లో బీజేపీతో ఒప్పందం చేసుకుని వచ్చారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్ ఇస్తూ రేవంత్ రెడ్డికి ఆన్సర్ చెప్పడానికి కేసీఆర్ అవసరం లేదు మేం చాలని.. ముందు మేం అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పండని అన్నారు. వెంటనే కేటీఆర్ కామెంట్స్ పై రేవంత్ రియాక్ట్ అయ్యారు. కేటీఆర్ అవగాహన రాహిత్యంతో సభను తప్పుదోవ పట్టించి సభను బయటకు వెళ్లిపోవాలని చూస్తున్నారని అన్నారు. తాను తండ్రి పేరును చెప్పుకుని మంత్రిని కాలేదని.. కింది నుంచి వచ్చానని అన్నారు. కేటీఆర్ మేనేజ్మెంట్ కోటాలో మంత్రి అయ్యారని. విదేశాల నుంచి వచ్చి ఎమ్మెల్యే అయ్యారని, తండ్రి పేరు చెప్పుకుని మంత్రి అయ్యారని విమర్శించారు. దీనిపై కేటీఆర్ స్పందిస్తూ రేవంత్ పేమెంట్ కోటాలో ముఖ్యమంత్రి అయ్యారని మండిపడ్డారు. తనది మేనేజ్మెంట్ కోటా అయితే మరి రాజీవ్ గాంధీ, రాహుల్ గాంధీ ఏ కోటా అని ప్రశ్నించారు. అంతకుముందు ప్రశ్నోత్తరాల సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రజలు శిక్షించినా భారాస మాత్రం మారలేదన్నారు. తప్పులు చేశారని ప్రజలు శిక్షించినా మారలేదు. భారాస నేతలకు మంచి బుద్ధి కలగాలని ప్రార్థిస్తున్నానని చెప్పారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపిందని, ఇందుకు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పంచాయతీలుగా మారిన తండాలకు రోడ్డు మార్గం లేదన్నారు. అన్ని తండాలకు మండల కేంద్రం నుంచి బీటీ రోడ్లు వేస్తామని తెలిపారు. తండాలకు విద్యుత్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు లక్షల ఇళ్లకు తాగు నీరు ఇవ్వలేదని ఆరోపించారు. తండాలకు 100 శాతం రోడ్లు వేయాలని నిర్ణయించామన్నారు. తండాలు, గూడాల్లో అభివృద్ధి జరిగితేనే అసలైన అభివృద్ధి అన్నారు. ప్రజలు శిక్షించినా బీఆర్ఎస్ నేతలు మారలేదని విమర్శించారు. కాగా, అంతకుముందు నిరుద్యోగుల సమస్యలపై ఉభయ సభల్లో వాయిదా తీర్మానం కోరుతూ బీఆర్ఎస్ నోటీసు ఇచ్చింది. జాబ్ క్యాలెండర్ ప్రకటనతోపాటు ఇతర న్యాయ పరమైన డిమాండ్ల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రదర్శిస్తున్న వైఖరి, నిరుద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వ అణచివేత వైఖరిపై చర్చ చేపట్టాలని కోరుతూ వాయిదా తీర్మానం ఇచ్చింది. స్పీకర్ ప్రసాద్ కుమార్ కు కేటీఆర్ ఈ నోటీసు ఇచ్చారు.

## ఆర్టీసీపై హరీశ్ వర్సెస్ పొన్నం



తెలంగాణ అసెంబ్లీలో ఆర్టీసీ కార్మికుల అంశంపై మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఆర్టీసీ కార్మికులను పీఆర్సీ పరిధిలోకి తెస్తామని చెప్పారని, దీనిని అమలు చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఆర్టీసీ విలీనంపై ఎప్పటిలోగా అపాయింటుమెంట్ డేట్ ప్రకటిస్తారో చెప్పాలన్నారు. అలాగే కార్మికుల యూనియన్ పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారో స్పష్టం చేయాలన్నారు. ఆర్టీసీకి నిధులు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆర్టీసీ అంశాన్ని బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. యూనియన్లను రద్దు చేసి, ఇప్పుడు పునరుద్ధరణ గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. ఆర్టీసీ కార్మికులు 50 రోజులు సమ్మె చేసినా గతంలో పట్టించుకోలేదని ఆరోపించారు. ఆర్టీసీ సొమ్మును కూడా ప్రభుత్వం వాడుకుందన్నారు. కానీ తాము మాత్రం ఆర్టీసీకి రూ.300 కోట్లు ఇస్తున్నామని తెలిపారు. కొత్త బస్సులను కూడా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీలో 3,035 మంది ఉద్యోగులను నియమిస్తున్నామన్నారు. పని భారం పెరిగినా ఆర్టీసీ కార్మికులు బాగా పని చేస్తున్నారని కితాబునిచ్చారు.

## కేటీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవ చేస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని కోరుకున్నారు. కేటీఆర్‌కు భగవంతుడు సంపూర్ణ ఆరోగ్యం ప్రసాదించాలన్నారు. తనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలు పటోళ్ల కార్తీక్ రెడ్డి, క్రిషాంక్ తదితరులు ఆయనకు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ కేటీఆర్ థ్యాంక్స్ చెప్పారు.

## తుమ్మిడిహట్టి వద్దే కట్టాలి : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 24 (ప్రజాస్వరం): తెలంగాణ శాసన మండలిలో సాగునీటి ప్రాజెక్టులపై స్వల్పకాలిక చర్చ జరిగింది. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడారు. తుమ్మిడహట్టి వద్దే ప్రాజెక్టు కడితేనే ప్రాణహిత నది నుంచి పుష్కలంగా నీళ్లు అందుతాయన్నారు. ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.5 వేలకోట్లు కేటాయించాలని కోరారు. గంధమల్ల రిజర్వాయర్ అంశం సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉందని మరో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభ దృష్టికి తీసుకొచ్చారు.



## సింగరేణిని ప్రైవేటీకరించం..

### కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి క్లారిటీ

న్యూఢిల్లీ, జూలై 24 (ప్రజాస్వరం): సింగరేణిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించేది లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ సింగరేణిని కాపాడాలని, ప్రైవేటీకరించవద్దని లోక్ సభలో కోరారు. ఈ అంశంపై కిషన్ రెడ్డి స్పందిస్తూ... సింగరేణి రాష్ట్ర ప్రభుత్వం అధీనంలో ఉందన్నారు. సింగరేణిని ప్రైవేటీకరించేది లేదని... తమ లక్ష్యంలో కూడా అది లేదన్నారు. సింగరేణికి పదేళ్ల నుంచి ఎలాంటి మైనింగ్ ఇవ్వలేదని, కానీ ఒడిశాలో తమ బీజేపీ ప్రభుత్వం రాగానే మైనింగ్ కోసం అనుమతులు మంజూరు చేశామని గుర్తు చేశారు. సింగరేణిపై నరేంద్రమోదీ ప్రభుత్వానికి కమిట్‌మెంట్ ఉందన్నారు.